సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 7 । ఆగస్టు । 2025



హార్సిలీహిల్స్‌కు పతంజలి, ఒబెరాయ్
పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు పతంజలి, ఒబెరాయ్ హోటల్స్ వస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ వెల్లడించారు. ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. -8లో



సారీ డాడీ క్షమించు...
నేను బాగా చదువుకుని మంచి జాబ్ చేయాలని కలలు కన్నావు.. నేను చదువుకోలేక పోతున్నా డాడీ నన్ను క్షమించు' అంటూ సూసైడ్ నోట్ రాసి తనువు చాలించింది శ్రావణి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.550
రెండోరకం	రూ.300	రూ.380

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 380 మెట్రిక్ టన్నులు



అరాచకానికి పరాకాష్ట!

టీడీపీ నేత బీటెక్ రవి బరి తెగిస్తున్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తన సతీమణిని అభ్యర్థిగా నిలబెట్టిన ఆయన గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. పచ్చని పల్లెల్లో అల్లకల్లోలం సృష్టిస్తూ విష సంస్కృతికి తెర తీస్తున్నారు. ఆది నుంచి హత్యా రాజకీయాల్నే నమ్ముకున్న బీటెక్ రవి తాజాగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకం చేస్తున్నారు.

- నాడు ఎంపీపీ పదవి కోసం హత్యా రాజకీయాలు!
- తాజాగా పులివెందులలో ఎంట్రీలోనూ ఇదే సంస్కృతికి బీజం
- పట్టణ ప్రశాంతత కలుషితం అవుతోందని ప్రజాస్వామ్యవాదుల ఆవేదన
- లోకల్ నాయకులకు అవకాశం ఇవ్వకుండా రంగప్రవేశం వెనుక అతి పెద్ద స్కెచ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. గతంలో ఎంపీపీ పదవి కోసం హత్యా రాజకీయాలు చేసిన ఆయన తాజాగా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలు కేంద్రంగా అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. భౌతిక దాడులు.. హత్యాయత్నం ఘటనలు వరుసగా తెరపైకి వస్తున్నాయి. తీవ్ర ఘర్షణలు..అల్లర్లు సృష్టించేందుకే నియోజకవర్గ వ్యాప్తంగా కొంతమందిని బ్యాచ్‌లుగా ఎంపిక చేసి.. ఎంచుకున్న వారిపై హత్యాయత్నానికి కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవికి హైటెక్ తెలివితేటలు అధికమని ఆయన సన్నిహితులు వ్యాఖ్యానిస్తుంటారు. అది నిజమని పలుమార్లు రుజువైంది. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో సింహాద్రిపురం ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మా రామలింగారెడ్డి ఎన్నికయ్యారు. ఒకే ఒక ఎంపీటీసీ సభ్యుడి ఆధిక్యతతో ఆయన విజయం సాధించారు. మెజార్టీ సభ్యుడిగా ఉన్న కొమ్మారామలింగారెడ్డి హత్యతో ఎంపీపీ ఖాళీ ఏర్పడితే ఆస్థానం గెలుపొంది చేజిక్కించుకోవచ్చునే ఎత్తుగడను బీటెక్ రవి ప్రయోగించారు. వెరసి ఎంపీపీ కొమ్మా రామలింగారెడ్డి హత్య తెరపైకి వచ్చిందని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఆపై ఏర్పడ్డ ఫ్యాక్షన్ నేపథ్యంలో ప్రతీకార హత్యలు లేకపోలేదు.



టీడీపీ నేతల దాడులలో గాయపడిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఇంటి వాస్తు కోసం రోడ్డుకు అడ్డంగా గోడ ఏర్పాటు

కసనూరు గ్రామానికి చెందిన బీటెక్ రవి సింహాద్రిపురంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నూతనంగా నిర్మించుకున్న ఇంటికి పరమడ వైపు రోడ్డు ఉంది. రోడ్డు అడ్డంగా గోడ కట్టారు. కారణమేమంటే వాస్తుకు అనువుగా రోడ్డుకు అడ్డంగా గోడ కట్టేశారు. అటువైపు ఇళ్లున్న వాళ్లంతా గగ్గోలు పెడుతున్నారు. బీటెక్ రవి అనుచరులు దాడులు చేస్తారనే భయం వారిని బాహాటంగా ప్రశ్నించకుండా చేసింది. ఫలితంగా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించినా చూస్తుండిపోయిన దుస్థితి నెలకొంది.

జెడ్పీటీసీ ఎంట్రీలోనూ అదే పరిస్థితి...

సింహాద్రిపురానికి చెందిన బీటెక్ రవి తన సతీమణి లతాను పులివెందుల జెడ్పీటీసీగా పోటీ చేయించడం వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు తెలుస్తోంది. పులివెందుల పట్టణం, రూరల్‌లో దందాలు, సెటిల్‌మెంట్లు మొత్తం వ్యవహారం గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు సమాచారం. స్థానికంగా టీడీపీ నేతలు పోటీకి ఆసక్తిగా ఉన్నా, బీటెక్ రవి తన కుటుంబ సభ్యుల్ని పోటీలో దింపడం వెనుక ఈ ప్రాంతంపై పట్టు సాధించాలనే తపన అధికంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డి లోకల్. ఇక టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతనాన్ లోకల్ అయినప్పటికీ పోటీకి ఆసక్తి చూపడం వెనుక బహుళ ప్రయోజనాలున్నట్లు పలువురు వెల్లడిస్తున్నారు.

పులివెందుల ప్రశాంతతకు భంగం...

ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడి ప్రజలు, రైతులు కక్షలకు దూరంగా ఉండి పూర్తిగా వ్యవసాయం బాటపట్టారు. అందుకు అనువైన పరిస్థితులు మహానేత కల్పించారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు వచ్చి చేరింది. ఆదాయం కళ్లు చూడడం, క్రమేపి ప్రశాంత వాతావరణానికి జనాలు అలవాటు పడ్డారు. 2004 నుంచి 2024 వరకూ పులివెందులలో ప్రశాంత వాతావరణం కొనసాగేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశాంతతకు భంగం ఏర్పడింది. తాజాగా జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అది మరింత ఎక్కువైంది. మంగళవారం రాత్రి సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి, అమరేష్‌రెడ్డి టార్గెట్‌గా హత్యాయత్నం చేశారు. బుధవారం మధ్యాహ్నం నల్లగొండుగారిపల్లెలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డి టార్గెట్‌గా హత్యాయత్నం చేశారు. టీడీపీ మూకలు బరితెగించి గ్రామస్తుల సమక్షంలోనే వేల్పుల రామలింగారెడ్డి హత్యకు విశ్వయత్నం చేశారు. పెట్రోల్ పోసి నిలువునా అంటించడానికి ప్రయత్నించారు. వాహనాలు ధ్వంసం చేశారు. అద్దాలను సమ్మెటతో పగలగొట్టి వాహనంలోకి పెట్రోల్ చల్లారు. తీవ్ర భయాందోళనలు సృష్టించారు. నల్లగొండుగారిపల్లె గ్రామస్తులు అడ్డుగా నిలవడంతో వేల్పుల రామలింగారెడ్డి ప్రాణాలతో బతికిపోయారని ప్రత్యక్ష సాక్షులు వివరిస్తున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే అరాచకానికి నిలువెత్తు రూపంగా బీటెక్ రవి నిలుస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంలో

ఎన్నికల కోలాహలం!



కరపత్రాలను అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, అంజద్‌బాష, అజయ్‌రెడ్డి, అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు

ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ కీలక నేతల ఇంటింటి ప్రచారం

సాక్షి రాయచోటి: ఆధ్యాత్మిక క్షేత్రం..భక్తులతో అలరాలే ఏకశిలానగరంలో రాజకీయ కోలాహలం కనిపిస్తోంది. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గెలుపు లక్ష్యంగా పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎక్కడికక్కడ చర్చలు...గెలుపునకు అవసరమైన వ్యూహాలు...ప్రత్యర్థి వర్గాల ద్వారా ఓట్లు రాబట్టేందుకు అవసరమైన ప్రణాళికలతో సాగుతున్నారు. నామినేషన్లతో పాటు పరిశీలన, ఉపసంహరణ ముగియడంతో అభ్యర్థులంతా ప్రచారంపై దృష్టి సారించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూసుకుపోతోంది. పార్టీలోని పలువురు కీలక నేతలంతా వచ్చి ప్రచారంలో పాల్గొంటూ అభ్యర్థి సుబ్బారెడ్డికి మద్దతుగా కదం తొక్కుతున్నారు.

- వైఎస్సార్ కడపజిల్లాలోని ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా బుధవారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ డిప్యూటీసీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నగర మేయర్, అన్నమయ్య జిల్లా పార్లమెంట్ పరిశీలకులు సురేష్ బాబు, కడప పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతోపాటు కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, గిడ్డంగుల సంస్థ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం నరవకాటిపల్లెలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా ఎంపీ మేడా రఘునాథరెడ్డి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొల్లపల్లి, దర్జిపల్లి గ్రామాల్లో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో పాటు బద్వేలు నియోజకవర్గ నాయకులు ప్రచారంలో పాల్గొని వైఎస్సార్ సీపీ అభ్యర్థిని దీవించాలని కోరారు. పార్టీ శ్రేణులతోపాటు నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ డప్పు వాయిద్యాల నడుమ ప్రచారం కొనసాగించారు.

పులివెందుల, ఒంటిమిట్టల్లో గెలుపు తథ్యం

ఒంటిమిట్టతోపాటు పులివెందుల జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, దీనిని ఎవరూ ఆపలేరని పార్టీ కీలక నేతలు ఉద్ఘాటించారు.బుధవారం ప్రచారంలో భాగంగా పాల్గొన్న అనంతరం వారు మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పులివెందులలో ఎన్ని అరాచకాలు సృష్టించినా ఏమి చేయలేరని...పోలీసులు కూడా పక్షపాత ధోరణి విడనాడాలని వారు హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలవుతున్నా ప్రజలకు ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయిందని, ప్రజలు ఎటువంటి పథకాలూ అందుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు ఈ ఉపఎన్నికలో తమ ఓటుతో ప్రభుత్వం పాలనపై గట్టి సమాధానం చెబుతారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు.

- ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం పలువురు వైస్సార్ సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రచార పర్వంలో భాగంగా పార్టీ నేతలు తొలుత స్వామి వారిని దర్శించుకున్నారు. పార్టీ నేతలకు అర్చకులు సాదర స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కీలక నేతలు

పులివెందులలో దాడి హేయం: ఇరగంరెడ్డి

ఒంటిమిట్ట: వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని నల్లగొండువారిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఉప ఎన్నిక ప్రచారం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో టీడీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. దాని పర్యవసానమే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడులు జరగడానికి కారణమన్నారు. టీడీపీ గూండాలు దాడి చేసినా రక్తం చిందించి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్‌గా రవి

రాయచోటి: రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా జి రవి నియమితులయ్యారు. స్థానికంగా పనిచేస్తున్న కమిషనర్ వాసుబాబును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడలో మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జి రవిని బదిలీపై ఇక్కడ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బాధ్యతల స్వీకరణ




రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన భావన

రాజంపేట: రాజంపేట సబ్‌కలెక్టర్‌గా హెచ్ఎస్ భావన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ కలెక్టరేట్‌కు ఆమె వచ్చిన సందర్భంగా అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన వైకోమానైదియాదేవిని బదిలీ చేశారు. ఈమె స్థానంలో భావనను ప్రభుత్వం నియమించింది.

- బాధ్యతలు తీసుకున్న అనంతరం సబ్‌కలెక్టర్ భావన రాయచోటి లోని కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌నుమర్యాదపూర్వకంగా కలిశారు.
- బదిలీ అయిన సబ్‌కలెక్టర్ వైకోమానైదియాదేవిని కలెక్టరేట్ సిబ్బంది సన్మానించి, వీడ్కోలు పలికారు. అయితే ఈమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. పరిపాలనాధికారి శ్రీధర్, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దబ్బును బ్యాంక్‌లో జమచేసి రశీదు అందిస్తున్న, ఈవో రమణారెడ్డి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి కన్నడ భక్తుడు రూ.1,00,000 విరాళం సమర్పించారు. కర్నాటక రాష్ట్రం ఆహార భద్రత శాఖ మంత్రి కెహెచ్ మునియప్ప ఆయన భార్య నాగరత్నమ్మలు నెల రోజుల క్రితం లక్కిరెడ్డిపల్లె శ్రీ మాతంగి పీఠం నిర్మించేందుకు వచ్చినపుడు శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించే నిత్యాన్నదానం కోసం విరాళం అందిస్తానని చెప్పారు. ఆయన ప్రతినిధితో రూ.1లక్ష స్కాన్ ద్వారా స్వామి వారి ఖాలో జమ చేశారు. ఈ మొత్తం ద్వారా వచ్చిన వడ్డీతో ప్రతి సంవత్సరం ఆయన జన్మదినం రోజున భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు.

అసలేం జరుగుతోంది!

- వరుసగా హత్యాయత్న ఘటనలు జరుగుతున్నా పట్టించుకోని పోలీస్ శాఖ
- ఒక్క జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ఇంత అల్లకల్లోలమా?

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఒక్క మండలం. కేవలం 10,800 ఓట్లు ఉన్న ప్రాంతం. ప్రజల మాన ప్రాణాలు రక్షించేందుకు రక్తాన్నైనా చిందిస్తామని ప్రతినబూనిన పోలీసు అధికారులంతా ఉన్నారు. అయినా అల్లర్లు జరుగుతూనే ఉన్నాయి..వరుసగా హత్యాయత్నం ఘటనలు తెరపైకి వస్తున్నాయి.అంత చిన్న ఏరియాలో ఉప ఎన్నికలు సజావుగా నిర్వహించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం.. పోలీస్ శాఖ ఉంది. కొంత మంది పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న ధోరణి కారణంగా మొత్తం వ్యవస్థకే మచ్చ వస్తోంది.

- వైఎస్సార్ కడప జిల్లాలో ఎస్పీ, అడిషన్ ఎస్పీలు ఇద్దరు, 9మంది డీఎస్పీలు, 48మంది సీఐలు, 98 మంది ఎస్ఐలు, 1600మంది సివిల్ పోలీసులు, 580 మంది ఏఆర్ పోలీసులు కొలువై ఉన్నారు. కాగా పులివెందుల,ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ రెండు చోట్ల ఎన్నికలు సజావుగా జరిగేలా చూడడం పోలీసు యంత్రాంగానికి చేతకావడం లేదంటే తప్పులో కాలేసినట్టే. వ్యవస్థలో నెలకొన్న లోపభూయిష్టం కారణంగా కొందరు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారడంతోనే అల్లకల్లోలాలు తెరపైకి వస్తున్నాయి. మంగళవారం హత్యాయత్నం ఘటన చోటుచేసుకోగా, కేసు నమోదుతో సరిపెట్టారు. నిందితులు పులివెందులలోనే తిష్టవేసి మరో హత్యాయత్నం ఘటనకు పాల్పడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి కొందరుపోలీసుల ఏకపక్ష చర్యలే అసలు కారణంగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.
- ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం సముచితమే. కానీ..ఏకపక్ష చర్యలే అభ్యంతరకరం. ఇప్పటికీ పులివెందుల రూరల్ మండలంలో 100మందికిపైగా బైండోవర్ చేశారు. తెలుగుదేశం వారిని అసలు బైండోవర్‌కు పిలవలేదు. వైఎస్సార్ సీపీ నేతల్ని మాత్రమే బైండోవర్ చేయిస్తున్నారు. పోలీసుల ఏకపక్ష చర్యలకు ఈవ్యవహారం మరో ఉదాహరణగా నిలుస్తోంది.

కొరవడిన సమర్థవంత అధికారుల స్ఫూర్తి...

జిల్లాలో ఎందరో పోలీసు అధికారులు విధులు నిర్వర్తించారు. వారిలో గుర్తుండిపోయే వారు కొందరే. ఎస్పీలుగా పనిచేసి, సమర్థవంత అధికారుల పేర్లు పరిశీలించాల్సి వస్తే, బాపూజీ అట్టాడా, పీహెచ్‌డీ రామకృష్ణ, అభిషేక్‌మహంతి, హర్షవర్ధన్‌రాజు ఎన్నికలను సజావుగా నిర్వహించారు. తాజాగా పులివెందులలో ఒక జెడ్పీటీసీ ఎన్నికను సమర్థవంతంగా జరిపించలేకపోవడం ప్రజాస్వామ్యవాదులకు ఆశ్చర్యం కల్గిస్తోంది.ఇప్పటికీఎంతోమంది నిష్టాతులైన అధికారులు ఉన్నప్పటికీ వరుస ఘట నలు జరగడం జిల్లా పోలీసు యంత్రాంగం వైఫల్యం తేటతెల్లమవుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

హంద్రీ-నీవాలో అక్రమ ప్రమోషన్లు!

- బాధ్యులైన వారిపై నివేదిక ఇవ్వాలని మెమోలిచ్చినా పట్టించుకోని అధికారులు
- అర్హత లేకున్నా టెక్నికల్ అసిస్టెంట్లుగా ఎలా ఇచ్చారని ఈఎన్‌సీ ఆగ్రహం

మదనపల్లె: హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశ మదనపల్లె సర్కిల్-3 పరిధిలో జరిగిన అక్రమ ఉద్యోగ నియామకాలు, అక్రమ పదోన్నతుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై జలవనరులశాఖ ఈఎన్‌సీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన వారిపై నివేదిక పంపాలని మదనపల్లె ఎస్ఈకి రెండు మెమోలు జారీ చేశారు. ఏపీఈఎస్ఎస్ నిబంధనల షెడ్యూల్ ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకానికి అవసరమైన అర్హత కోసం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నిర్వహించే ట్రేడ్ టెస్ట్ (డ్రాఫ్ట్స్ మ్యాన్) సివిల్ లేదా మెకానికల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. నియామకాలు, బదిలీలు, పదోన్నతులను పరిగణలోకి తీసుకునేటప్పుడు సర్వీసు నియామకాల జీవో, ప్రభుత్వ సూచన లను పాటించాలని స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. అయితే ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఈ నిబంధనలు, జీవోలను తుంగలో తొక్కారు. ఇవేమి తమకు పట్టవని పక్కన పడేశారు. చేయాల్సింది చేసేశాక ఇప్పుడు మెమోలు జారీ అవుతున్నా వాటిని డొంట్ కేర్ అంటున్నారు.

అక్రమ ప్రమోషన్ల వివరాల్లోకి వెళితే..

మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి డిప్లొమా (ఈసీఈ)తో టెక్నికల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. 2013 మార్చిన ఏడున ఆమెకు టెక్నికల్ అసిస్టెంట్ నుంచి జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించారు. తర్వాత 2022 జూలై ఒకటిన జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ నుంచి టెక్నికల్ ఆఫీసర్‌గా మరోసారి పదోన్నతి పొందారు. పదోన్నతులు పొందిన తర్వాత దీనికి అవసరమైన అర్హత కలిగిన విద్యను దూర విద్య ద్వారా అభ్యసించేందుకు అనుమతి కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించడంతో అక్రమ పదోన్నతుల వ్యవహారం పసిగట్టారు. దీంతో గతంలోనే ఎస్ఈలకు సర్కులర్ మెమోలను ఈఎన్‌సీ అధికారులు జారీ చేశారు. అక్రమ నియామకాలపై గతంలో మెమోలు ఇచ్చినా ఎందుకు మౌనంగా ఉండి ఇప్పటిదాకా కొనసాగిస్తున్నారని ఈ ఏడాది ఏప్రిల్ 24, జూలై 21న జారీ చేసిన మెమోల్లో ఎస్ఈని ఈఎన్‌సీ ప్రశ్నించారు. 14 ఏళ్ల తర్వాత ఎస్ఈ ఆ మహిళా ఉద్యోగి ఇప్పుడు డ్రాఫ్ట్స్‌మ్యాన్ ఐటీఐ విద్య అభ్యసించేందుకు అనుమతి ప్రతిపాదనలను.. అక్రమ పదోన్నతులపై ఎలాంటి వివరణ ఇవ్వకుండా పంపడంపై విస్మయం వ్యక్తం చేసిన ఈఎన్‌సీ జూలై 21న జారీ చేసిన మెమోలో మహిళ ఉద్యోగికి అక్రమ పదోన్నతులు కల్పించిన అధికారుల పేర్లతో వివరాలు పంపాలని ఆదేశించారు.



మదనపల్లె సర్కిల్-3 ఎస్ఈ కార్యాలయం

మరో ముగ్గురికి పదోన్నతులు

మహిళా ఉద్యోగికి కట్టబెట్టిన పదోన్నతులతో సరిపెట్టని ఉన్నతాధికారులు సర్కిల్ పరిధిలో పని చేస్తున్న మరో ముగ్గురు ఉద్యోగులకు ఇదే విధంగా అక్రమ పదోన్నతులు కల్పించారు. మదనపల్లె సర్కిల్ పరిధిలోని కుప్పం డివిజన్‌లో పని చేస్తున్న బ్లూ ప్రింటర్ ఆపరేటర్లు వై.చెన్నయ్య, కే.అబ్బిరెడ్డెయ్య, కదిరి డివిజన్‌లో పని చేస్తున్న పి.ఖాదర్‌బాషాల విద్యార్హత ప్రకారం పదోన్నతులు కల్పించాలి. అయితే అధికారులు ఇవేమి పట్టించుకోలేదు. వీరు పదోన్నతులు పొందాలంటే..నిబంధనల ప్రకారం ట్రేడ్ టెస్ట్ (డ్రాఫ్ట్స్‌మ్యాన్) సివిల్ లేదా మెకానికల్ కోర్సులో అర్హత సాధించి ఉండాలి. అయితే దీన్ని పట్టించుకోని అధికారులు ముగ్గురికి టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతులను పసిగట్టిన ఈఎన్‌సీ మదనపల్లె ఎస్ఈకి జూలై 8న మెమో జారీ చేశారు. ఈ ముగ్గురి పదోన్నతులపై ఇంతవరకు చర్యలులేవు. వీరికి పదోన్నతులు ఎలా ఇచ్చారు, దీనికి బాధ్యులైన అధికారులు ఎవరు, వారి వివరాలు, సమగ్ర నివేదిక పంపాలంటూ మెమోలో కోరారు.

ఏం జరుగుతోంది?

హంద్రీ-నీవా ప్రాజెక్టు కార్యాలయ పరిధిలో అక్రమ పదోన్నతుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అసలు కార్యాలయంలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. మదనపల్లె సర్కిల్-3 కార్యాలయం పరిధిలో సత్యసాయిజిల్లా ధర్మవరంలో డివిజన్-10, కదిరిలో డివిజన్-9, 10, కర్నూలుజిల్లా ఎమ్మిగనూరులో గురురాఘవేంద్ర ప్రాజెక్టు-2, కుప్పం డివిజన్-12 లతోపాటు సర్కిల్ కార్యాలయం నడుస్తున్నాయి. దీనితో ఎక్కడెక్కడో ఉన్న కార్యాలయాల్లో ఇంకా ఇలాంటి అక్రమ ప్రమోషన్లు, బదిలీ జరిగాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



చర్యలు చేపట్టాం

ఈఎన్‌సీ ఇచ్చిన మెమోలపై అక్రమ పదోన్నతుల వ్యవహారంపై చర్యలు మొదలు పెట్టినట్లు ఎస్ఈ విఠల్ ప్రసాద్ సాక్షికి చెప్పారు. కోరిన మేరకు ఈఎన్‌సీకి నివేదించడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టామని చెప్పారు.

అతిథి సౌకర్యాల్లో లోటు రానివ్వద్దు

బి.కొత్తకోట: పొరుగు రాష్ట్రాలు, ఏపీ నుంచి వచ్చే అతిథులకు సౌకర్యాల్లో ఎలాంటి లోటు రానివ్వకుండా చూసుకోవాలని హార్సిలీహిల్స్ టూరిజం కొత్త మేనేజర్ శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టాక అతిథిగృహాలు, బార్, రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. అతిథులకు అందిస్తున్న భోజనం, అల్పాహారం రుచిలో ఫిర్యాదులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలిచ్చారు. అతిథిగృహాల్లో పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు.

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన షేక్ షాకీర్‌ను రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సీఐల బదిలీ

రాయచోటి: జిల్లా పరిధిలో సీఐలకు స్థాన చలనం కల్పిస్తూ కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో బదిలీలు అయిన సీఐల వివరాలు..రాయచోటి ట్రాఫిక్ సీఐగా కుళాయప్ప, మదనపల్లె వన్ టౌన్ అర్బన్ పీఎస్‌కు డి నాగార్జున, మదనపల్లె టూ టౌన్ అర్బన్ పీఎస్‌కు, కె రాజారెడ్డి, రాజంపేట సీఐగా, డి నాగార్జున, మన్నూరు సీఐగా జె ప్రసాద్ బాబు, కలికిరి సీఐగా ఎస్అనీల్ కుమార్, వాయల్పాడు సీఐగా బి రాఘవ రెడ్డి, కలకడ సీఐగా, బి లక్ష్మన్న, ములకల చెరువు సీఐగా ఓ వెంకటేశు, బి కొత్తపేట అర్బన్ పీఎస్‌కు కె గోపాల్ రెడ్డి, ఆర్ఎస్‌టీఎఫ్ అన్నమయ్య సీఐగా పి చంద్రశేఖర్, ఆర్ఎస్ఏటీఎఫ్ అన్నమయ్యకు కె రామచంద్ర, ఎస్‌బీ-3 అన్నమయ్య, ఎం తిమ్మారెడ్డి, డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య ఎస్ గురునాథ్, వీఆర్ అన్నమయ్యకు ఎ మోహన్ కుమార్‌లను బదిలీ చేస్తూ డిఐడి ఆదేశాలను జారీ చేశారు.

క్లుప్తంగా

పొలం కంచె ధ్వంసం



మిట్టపల్లెలో కంచె తొలగించాలిలా..

రాజంపేట : మండలంలోని పెద్దకారంపల్లె పరిధిలోని మిట్టపల్లె ప్రాంతంలో ఈశ్వరరాజు అనే రైతుకు సంబంధించి పొలం కంచెను బుధవారం కొందరు ధ్వంసం చేశారు. లింగంపల్లె గ్రామానికి చెందిన హస్తి వెంకట్రాజు, లక్ష్మీకర్ రాజు, భానుప్రకాశ్‌రాజు తన పొలం కంచెను ధ్వంసం చేశారని బాధిత రైతు మన్నూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ

సిద్దవటం : మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారిలోని మిట్టపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సిద్దవటం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాఘవేంద్ర మాధవరం-1 నుంచి ద్విచక్ర వాహనంలో స్టేషన్‌కు వెళ్తున్నారు. మిట్టపల్లె గ్రామానికి చెందిన సోమశేఖర్ ద్విచక్ర వాహనంలో మాధవరం-1కు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఇరువురి వాహనాలు ఢీకొన్నాయి. రాఘవేంద్రకు తీవ్రగాయాలవగా 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సోమ శేఖర్‌కు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల అదృశ్యం

నిమ్మనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యం కాగా, కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బండ్లపైకి చెందిన నరేష్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 3న పనుల కోసం మదనపల్లెకు వెళ్లగా అతడి భార్య గాయత్రి(22) కట్టెలు తీసుకువస్తానని వెళ్లి కనిపించకుండా పోయింది. ఇంటికి వచ్చిన నరేష్ భార్యను వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిమ్మనపల్లె కందూరు రోడ్డుకు చెందిన సయ్యద్‌ఖాన్ భార్య సబీహా ఐదోతేదీ మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి కుమారుడికి భోజనం క్యారియర్ ఇచ్చి వస్తానని వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమె భర్త, కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆమేరకు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హార్సిలీహిల్స్‌కు పతంజలి, ఒబెరాయ్ వస్తున్నాయి!

అభివృద్ధి పనులు తిలకించిన కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట : పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు పతంజలి, ఒబెరాయ్ హోటల్స్ వస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ వె వెల్లడించారు. బుధవారం ఆయన మండలంలోని హార్సిలీహిల్స్‌పై టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్ర, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో పతంజలి కార్యకలాపాల నిర్వహణపై టూరిజంతో అవగాహన ఒప్పందం చేసుకుంటుందని, భూ కేటాయింపు కావాలని కోరలేదని స్పష్టం చేశారు. టూరిజం నిర్వహణలోని భవనాల్లోనే పతంజలి కార్యకలాపాలు సాగిస్తుందని చెప్పారు. ఒబెరాయ్ సంస్థకు 20 ఎకరాలు కేటాయించామని, ఆ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నాక ఇక్కడ చర్యలు ప్రారంభిస్తారని అన్నారు. ఖరీఫ్ వ్యవసాయం 9.9శాతానికి పరిమితమైందని, భూగర్భజలాలు అడుగంటిపోయిన కారణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని చెప్పారు. తంబళ్లపల్లె నుంచి రైలులో ఢిల్లీకి టమాట తరలించేలా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. హార్సిలీహిల్స్‌పైకి వచ్చే సాధారణ పర్యాటకుల సంఖ్య పెరిగిందని చెప్పారు.

మందుబాబుల కట్టడి, పారిశుద్ధ్యంపై చర్యలు

కుటుంబాలతో వచ్చే సాధారణ పర్యాటకులకు మందుబాబు కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చెప్పారు. ఐ లవ్ హార్సిలీహిల్స్ బోర్డులోని అక్షరాలను మందుబాబులు ధ్వంసం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని గాలిబండపై ఏర్పాటు చేసి రోజులు గడవకనే ధ్వంసం చేయడం సరి కాదన్నారు. దీనికోసం నలుగురు సెక్యూరిటీ గార్డులను నియమించి వారితో భద్రత కొనసాగిస్తామన్నారు. పారిశుద్ధ్య పనులకు పది మంది కార్మికుల నియామకం, వాకింగ్ ట్రాక్ నిర్మాణం,వీధిదీపాల కోసం టెండర్లు పిలిచినట్టు చెప్పారు. వీఎస్‌ఆర్ భవనం అద్దె నెలకు రూ.50వేల నుంచి రూ.1.80 లక్షలకు పెంచామని, రెవెన్యూ అతిథిగృహం నెలకు రూ.1.05 లక్షలకు అప్పగించామని చెప్పారు. కొండపై కొత్తగా నిర్మించిన, ఏర్పాటు చేసిన వాటర్‌ఫాల్స్, వెల్‌కం హార్సిలీహిల్స్, ఐ లవ్ హార్సిలీహిల్స్ బోర్డులు, జిడ్డు సర్కిల్, వివేకానంద సర్కిళ్లకు జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. తహసీల్దార్ ఎ.బావాజాన్, కమిషనర్ జీవీ.పల్లవి, ఎంపీడీఓ కృష్ణవేణి, ఆర్‌ఎస్‌డీటీ బాలాజీ, ఆర్‌ఐ వీరాంజనేయులు, వీఆర్‌ఓ జయరామిరెడ్డి, టూరిజం మహేష్ బుజ్జి, ఉద్యోగులు పాల్గొన్నారు.



గాలిబండపై పగిలిన బోర్డు అక్షరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్

సారీ డాడీ క్షమించు...

- మళ్లీ జన్మంటూ ఉంటే మీ కూతురిగానే పుడుతా..
- సూసైడ్ నోట్ రాసి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : 'మీరు నన్ను ఎంతో ప్రేమగా చూశారు.. నేను బాగా చదువుకుని మంచి జాబ్ చేయాలని ఎన్నో కలలు కన్నావు.. కానీ నేను చదువుకోలేకపోతున్నా డాడీ నన్ను క్షమించు' అంటూ సుసైడ్ నోట్ రాసి తనువు చాలించింది బీటెక్ విద్యార్థిని రెడ్డి శ్రావణి(21). పట్టణంలోని రామారావు కాలనీలో జరిగిన ఈ సంఘటన స్థానికులను కలచివేసింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన వెంకటసుధాకర్, సుగుణ దంపతులకు అశ్విని, ప్రసన్న, శ్రావణి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అశ్వనికి వివాహం కాగా, రెండో కుమార్తె ప్రసన్న బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. మూడో కుమార్తె పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చేనేత కార్మికుడైన వెంకట సుధాకర్ భార్య సుగుణ ఐదేళ్ల క్రితం మృతి చెందగా కుమార్తెలను కష్టపడి చదివించారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రెండు రోజుల కిందట శ్రావణి వరలక్ష్మీ వ్రతం చేసుకునేందుకు పులివెందుల కాలేజీ నుంచి ఇంటికి వచ్చింది. అదే రోజున తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా తాను చదువుకోలేకపోతున్నానని సుసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. బుధవారం ఉదయాన్నే వెంకటసుధాకర్ స్నానం చేసుకుని గుడికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గదిలోకి వెళ్లి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గుడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తండ్రి వెంకటసుధాకర్ ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి హతాశుడయ్యాడు. స్థానికుల సహాయంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకట సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన రెడ్డిశ్రావణి మృతదేహం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన అబ్దుల్‌రహిమాన్

కలకడ : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కలకడలో జరిగింది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు...కలికిరి మండలం మేడికుర్తి గ్రామానికి చెందిన ఆర్.దస్తగిరిసాబ్ కుమారుడు ఆర్.అబ్దుల్‌రహిమాన్(55) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం కలకడలో పని ముగించుకుని వెళ్తుండగా వర్షం కురవడంతో ఆగిపోయారు. మరుసటిరోజు బుధవారం ఉదయం 4-30 గంటల సమయంలో కలికిరి వైపు నడచి వెళ్తుండగా కలకడ హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన అబ్దుల్‌రహిమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రెహనా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తన స్థలం ఆక్రమిస్తున్నారని మహిళ వినతి



రెవెన్యూ కార్యాలయం వద్ద బాధిత మహిళలు పర్విన్, రేష్మా

కురబలకోట : తమ స్థలంలో దౌర్జన్యంగా మరొకరు పాగా వేసి అక్రమంగా కట్టడం నిర్మించారని కురబలకోటకు చెందిన బాధిత మహిళలు పర్విన్, రేష్మా బుధవారం కలెక్టర్‌కు విన్నవించారు. వారి కథనం మేరకు..మండలంలోని దొమ్మన్నబావి హైవే పక్కన వారికి రూ.4 కోట్లు విలువైన 28 సెంట్ల స్థలం ఉంది. ఇటీవల అదే ఊరికి చెందిన ఒకరు దౌర్జన్యంగా ఆక్రమించి కట్టడం నిర్మించారు. అభ్యంతరం చెబితే తమపై దౌర్జన్యానికి వచ్చారని బాధితులు తెలిపారు. ఆక్రమణదారుడికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని వాపోతున్నారు. సర్వే నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



ఎస్‌ఐ వద్దకు వచ్చిన ప్రేమికులు

నందలూరు : రక్షణ కల్పించాలంటూ ప్రేమజంట నందలూరు పోలీసులను ఆశ్రయించిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి వివరాల మేరకు.. మండలంలోని టంగుంటూరు గ్రామానికి చెందిన చలమాల నవీన్ కుమార్, పులివెందుల మండలం భాకరపురం గ్రామానికి చెందిన సయ్యద్ మనీషా ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చి రాజంపేట సమీపంలోని పోలిచెరువు కట్ట వద్ద ఆంజనేయస్వామి గుడిలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమ బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ తమను ఆశ్రయించారని ఎస్‌ఐ తెలిపారు. ఇరువురి కుటుంబీకులను పిలిపించి ఘర్షణలకు పాల్పడకుండా సామరస్యంగా ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

గండికోట డ్యాంలో గుర్తుతెలియని శవం లభ్యం



కొండాపురం : గండికోట ప్రాజెక్టు నీటిలో రైల్వే వంతెన వద్ద గుర్తుతెలియని ఓ యువకుడు శవం బుధవారం లభ్యమైనట్లు కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని పాత కొండాపురం-ఏటూరు వైపు వెళ్లే పాతదారి వద్ద రైల్వే వంతెన సమీపంలో గండికోట జలాశయం వెనుక జలాల్లో 4.5 అడుగుల గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు జీన్స్ ఫ్యాంట్ ధరించాడని, వయస్సు 20 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిస్తే ఎస్‌ఐ 9121100612, సీఐ 9121100611 ఫోన్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఇన్‌స్పైర్ మనక్ ఓరియంటేషన్‌కు హాజరుకావాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి మహేష్

రాయచోటి : డివిజనల్ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం కోరారు. అన్నమయ్య జిల్లాలోని మూడు డివిజన్లలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డు నామినేషన్లకు సంబంధించి అవగాహన తరగతులు గురువారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయచోటిలోని డైట్, మదనపల్లి, రాజంపేట జెడ్పీ పాఠశాలల్లోనూ శిక్షణా తరగతులు ఉంటాయని, ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల నుంచి ఒక ఉపాధ్యాయుడు ఓరియంటేషన్‌కు హాజరు కావాలన్నారు.

పీజీ కోటాను తగ్గించడం దారుణం

ఓబులవారిపల్లె : 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న డాక్టర్లకు పీజీ కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడం దారుణమని వైద్యాధికారులు గురు మహేష్, డాక్టర్ రాజశేఖర్ అన్నారు. విలేకరులతో వారు మాట్లాడుతూ ఎలాంటి సమాచారం లేకుండా మీడియా ద్వారా నిర్ణయాన్ని తెలియజేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న వైద్యులను ఇది తీవ్రంగా నిరాశకు గురిచేసిందన్నారు. ఈ నిర్ణయం భవిష్యత్తులో మారుమూల గ్రామాలలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్యపై ప్రభావితం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యులను మోసగించిందని, వెంటనే తీసుకున్న నిర్ణయాలు వెనక్కు తీసుకోవాలని వారు కోరారు.

ఊయలే.. ఉరితాడై

– గొంతుకు బిగుసుకుపోయి బాలిక మృతి



తల్లి ఒడిలో మృతురాలు ఆరీఫా

జమ్మలమడుగు : సరదాగా ఆడుకునే ఊయలే.. గొంతుకు బిగుసుకుపోయి ఆరీఫా(9) ప్రాణం తీసింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న పాప చనిపోవడంతో ఇంటిల్లిపాదీ కన్నీరు మున్నీరయ్యారు. ఎర్రగుంట్ల పట్టణం వినాయకనగర్ కాలనీలో జరిగిన ఈ సంఘటన స్థానికులను విషాదంలో నింపింది. సీఐ నరేష్ బాబు వివరాల మేరకు.. వినాయకనగర్ కాలనీలో నివాసముంటున్న ఆలీబాషా స్థానిక నాపరాయి గనిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన కుమార్తె ఆరీఫా పట్టణంలోని ప్రభు త్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. సా యంత్రం స్కూల్‌నుంచి వచ్చిన ఆరీఫా ఇంట్లో ఎవ రూ లేకపోవడంతో ఊయలతో సరదాగా ఆడుకుంటోంది. ఈ సందర్భంగా చీర ఊయల మెడకు బిగించుకుపోవడంతో ఊపిరాడక మరణించింది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు పాపను చూసి స్పృహ కో ల్పోయిందని భావించి ఆసుపత్రికి తీసుకుపోయారు. వైద్యులు పరీక్షించి ఆరీఫా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పాప మరణం స్థానికులను కలవరపెట్టింది.

సామాజిక మాధ్యమాలు వేదికగా మోసాలు

ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్

కడప అర్బన్ : సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేస్తున్నారని వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ మార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసులు నమోదవుతున్నాయని, డబ్బులు మోసమోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసగాళ్లు ముందుగా 'ఇన్వెస్ట్ చేసి డబ్బు డబుల్ చేసుకోండి' అంటూ లింకులు పంపుతారని, మీరు పెట్టుబడిగా పెట్టిన రూ.1000 లేదా రూ.2000కు ముందు డబుల్ నగదు ఇచ్చినట్లు చూపి నమ్మిస్తారన్నారు. తర్వాత భారీ లాభాల కోసం డిపాజిట్లు చేయమని చెప్పి మోసం చేస్తారన్నారు. అనంతరం యాప్ లింక్ బ్లాక్ చేయడం, డబ్బు విత్‌డ్రా కాకుండా చేయడం చేస్తారని తెలిపారు. వాట్సాప్ ద్వారా ఓ మహిళ రూ.1.98కోట్లు, మరో యువకుడు రూ.17 లక్షలు నష్టపోయారని తెలిపారు. ఓ యువకుడికి మ్యాట్రిమోనీ ద్వారా ఆన్‌లైన్‌లో పరిచయమైన యువతి,,షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో గ్యారెంటీ ప్రాఫిట్ అంటూ చెప్పి నమ్మించడంతో లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిపారు. ఆర్‌బీఐ, ఎస్‌బీఐ వంటి చట్టబద్ధ సంస్థల నుంచి గుర్తింపు పొందని యాప్‌లలో డబ్బు పెట్టిమోసపోవద్దని సూచించారు. మోసానికి గురైతే సైబర్ క్రైమ్ సెల్ లేదా 1939కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు మొండిచేయి

విధుల నుంచి తప్పుకున్న సిబ్బంది

మదనపల్లె : మదనపల్లె సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలో 80 మంది దినసరి పారిశుద్ధ కార్మికులు తమ విధుల నుంచి తప్పుకున్నారు. ఐదునెలలుగా వేతనాలు అందడం లేదన్న ఆందోళనతో ఉన్న కార్మికుల కష్టాలను సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. కార్మికుల నియామకం, కొనసాగింపు అంశాలపై అపోహ తొలగిపోవడంతో కార్మికులకు అసలు నిజం తెలిసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవిడ్ సమయంలో అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించుకునేందుకు అనుమతి ఇచ్చింది. తర్వాత వారిని కొనసాగించొద్దని ఆదేశించడంతో విధులు ముగిశాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 జులైలో ఇచ్చిన మెమో ఆధారంగా 80 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించుకుని పనులు చేయించుకొంటున్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.15 వేల వేతనం చెల్లిస్తుండగా, గత ఏడాది డిసెంబర్‌లో ఏపీఓ వేతనాల చెల్లింపు నియామక ఉత్తర్వును జత చేయక పోవడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ జీతాలు నిలిపివేశారు. దీంతో అప్పటినుంచి కార్మికులు విధులు నిర్వహిస్తూనే వేతనాల కోసం ఎదురుచూశారు. ఈ వ్యవహారంపై సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో విధుల నిర్వహణకు ప్రభుత్వ ఆమోదం లేదన్న విషయం తెలియజెప్పింది. ఫలితంగా ఇకపై విధులు నిర్వహించినా వేతనాలు అందవని నిర్ధారించుకున్న కార్మికులు జూలై ఒకటి నుంచి విధులకు వెళ్లడం లేదు. కాంట్రాక్టు, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించుకుంటున్నారు. కమిషనర్ ప్రమీల బుధవారం మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి దినసరి పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో లేరని, పనుల నుంచి తప్పుకున్నారని చెప్పారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను చూపుతున్న అధికారులు

సుండుపల్లె : అక్రమంగా తరలిస్తున్న పది ఎర్రచందనం దుంగలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి అటవీశాఖ అధికారి వై.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళ్లితే.. రాయవరం సెక్షన్ సుండుపల్లె బీట్ పరిధిలోని సద్దికూళ్లవంక చెక్‌పోస్టు దగ్గర అటవీశాఖ అధికారులు నాకాబందీ నిర్వహించారు. ఒక హుండాయ్ కారు వేగంగా వచ్చి బారిగేట్ వేసిన విషయం పసిగట్టి సుండుపల్లె మార్గంలోకి వెళ్లగా అటవీ సిబ్బంది వెంబడించారు. సిబ్బందిని చూసి వాహనాన్ని నిలిపి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. వాహనం తనిఖీ చేయగా అందులో 326 కేజీలు గల పది ఎర్రచందనం దుంగలున్నాయి. ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని పారిపోయిన వ్యక్తుల కోసం గాలిస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీలో రాయవరం డీవైఆర్‌ఓ రమేష్‌బాబు, ఎఫ్‌బీఓ అంజన స్వామి, గౌషా, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

థర్మాకోల్ ప్లేట్లలో ఆహారం తింటే ప్రమాదం



పానీపూరీ (ఫైల్)

చిన్నమండెం : థర్మాకోల్ పేట్లలో ఆహారం తీసుకుంటే ప్రమాదమని ఆహార భద్రతా అధికారి వెంకటరెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ చిన్నమండెం మండల కేంద్రంలో ఇటీవల పానీపూరీ విక్రయిస్తున్న దుకాణాల్లో థర్మాకోల్ ప్లేటు వాడుతున్న విషయం గమనించి వ్యాపారులను మందలించామని తెలిపారు. వినియోగదారుల నుంచి ఇటీవల ఫిర్యాదులు వసుత్నాయని తెలిపారు. జనాల బలహీనతలతో వ్యాపారం చేయకూడదని, మండల వ్యాప్తంగా పానీపూరీ దుకాణాలపై తనిఖీలు చేపట్టామన్నారు. వేడిగా ఉన్న కట్‌లెట్, పానీపూరీ తదితర ఫాస్ట్‌ఫుడ్ థర్మాకోల్ ప్లేట్లలో ఇవ్వడం గుర్తించామన్నారు. వాటిలో ఆహారం తీసుకుంటే ప్లాస్టిక్ కణాలు వేడికి ఆహార పదార్థాల్లో కలిసి కడుపులోకి వెళ్తాయని, కాలేయం దెబ్బతిని ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. క్రమంగా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. స్టీలు పాత్రలే వాడాలని, పానీపూరి తయారీలో నాణ్యత విలువలు పాటించాలని సూచించారు.

పెన్నానదిలో మృత దేహం లభ్యం



పోసా కృష్ణయ్య మృతదేహం

సిద్దవటం : మండలంలోని వెంకటాయపల్లె సమీపంలోని పెన్నానదిలో వృద్ధుని మృత దేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామానికి చెందిన పోసా కృష్ణయ్య(74)గా పోలీసులు గుర్తించారు. మృతుడి కుమారుడు మధుసూదన్ బుధవారం మాట్లాడుతూ తన తండ్రి కృష్ణయ్య ఆగష్టు 2న టీవీ చానల్ మార్పే విషయంలో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు. ఒకసారి ఫోన్ చేసి ఇంట్లో బెడ్ రూమ్‌లో రూ.7,500 నగదు ఉంది.. తీసుకోమని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారన్నారు. అనంతరం ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో విచారించామన్నారు. ఆచూకీ లభించలేదని ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వెంకటాయపల్లె వద్ద పెన్నానదిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వచ్చి చూసి తన తండ్రిదేనని గుర్తించామన్నారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డాక్టర్ అనుదీప్ కుమార్ నది వద్ద మృత దేహానికి పంచనామా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

చేనేతలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ పద్మశాలీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జింకా విజయలక్ష్మి



ప్రొద్దుటూరు : రాష్ట్రంలో చేనేతలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్‌సీపీ పద్మశాలీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జింకా విజయలక్ష్మి తెలిపారు. విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. 2014లో చేనేతలకు చంద్రబాబు ఇచ్చిన 25 హామీలు బుట్టదాఖలు చేశారని విమర్శించారు. 2024 మేనిఫెస్టోలో చేనేతలకు ఉచిత విద్యుత్, జీఎస్టీ ఫ్రీ హామీలిచ్చినా వాటిని అమలు చేయలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన అన్ని సంక్షేమ పథకాలను తాము ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ఏడాదిన్నర గడచినా ఇవ్వలేదని విమర్శించారు. ఆప్కోను నిర్వీర్యం చేసి, చేనేత వ్యవస్థను అధఃపాతాళానికి తొక్కారని, వారంతా మళ్లీ ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపిస్తున్నారని సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో జగనన్న ప్రతి చేనేత కుటుంబానికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లు రూ.1,20,000లు వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.983 కోట్లు ఆర్థిక సాయం అందించారని, కరోనా కష్ట కాలంలోనూ ఈ మొత్తం అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆప్కో వస్త్రాలను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ద్వారా పరిచయం చేసి చేనేతలను అగ్రగామిగా నిలిపారని తెలిపారు. వెంకటగిరి, మాధవరం, ధర్మవరం, మంగళగిరి, పెడన వంటి ప్రాంతాల్లో చేనేతలకు రెండు సెంట్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయకుండా.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పిచ్చికుక్క దాడిలో యువకుడికి గాయాలు



గాయపడిన ప్రవీణ్

సిద్దవటం : మండలంలోని టక్కోలు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు ప్రవీణ్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుడి, ఎడమ చేతులు, మెడ భాగాన బలమైన గాయాలయ్యాయి. ప్రవీణ్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులను వెంబడిస్తూ పరుగులు పెడుతోందన్నారు. అధికారులు వాటిని పట్టి తరలించాలని కోరారు.